

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 24-11-2024 | సంపుటి - 20 సంచిక -215 రూ : 4 పేజీలు: 8



GOVERNMENT OF TELANGANA



## మహిళాశక్తికి వందనం
## మహిళల ప్రగతికి అభివందనం






## మాట ఇచ్చాం. పూర్తి చేశాం.

### మహాలక్ష్మి

**ఉచిత బస్సు ప్రయాణం:** అధికారం చేపట్టిన 48 గంటల్లోనే 2 గ్యారంటీల అమలుకు శ్రీకారం. నవంబర్ 17,2024 నాటికి 109.80 కోట్ల మంది మహాలక్ష్మి ప్రయాణికులకు రూ.3,710.22 కోట్లు ఆదా. రాష్ట్ర వ్యాప్తంగా 7,292 తెలంగాణ ఆర్టీసి బస్సుల్లో మహాలక్ష్మి అమలు.

**రూ. 500కే గ్యాస్ సిలిండర్:** 40 లక్షల మంది లబ్దిదారులతో మొదలై, ప్రస్తుతం 43 లక్షల మందికి లబ్ది. రీఫిల్ చేయించుకున్న 1,41,76,222 గ్యాస్ సిలిండర్ లకు రాయితీగా ప్రభుత్వం రూ.394·13 కోట్లు చెల్లించింది.

### ఇందిరా మహిళాశక్తి

మార్చి 12,2024 న గౌ || **ముఖ్యమంత్రి గారి** చేతుల మీదుగా మహిళా శక్తి శుభారంభం,
1 లక్ష కోట్ల రుణాలు. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం.
రాష్ట్రవ్యాప్తంగా మహిళా శక్తి క్యాంటీన్లు, మహిళా శక్తి సముదాయాలు ప్రారంభం.

### గృహజ్యోతి

**గృహజ్యోతి '0' బిల్లు:** 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్. లబ్ధిదారులు: 49,54,834 కుటుంబాలు. మార్చి 2024 నుండి నవంబర్ 2024 వరకు జారీచేయబడిన 3,64,57,380 జీరో బిల్లులకు రూ.1,336 కోట్లను ప్రభుత్వం భరించింది.

### ఇందిరమ్మ ఇండ్లు

119 నియోజకవర్గాలలో అమలు. ప్రతి నియోజకవర్గంలో ఏడాదికి 3,500 ఇందిరమ్మ ఇళ్ళు పంపిణీ. 5 సం||ల్లో 20 లక్షల ఇళ్ళు కేటాయింపు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.22,500 కోట్ల వ్యయంతో 4,50,000 ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు.

## ప్రజాపాలనలో ప్రథమ సంవత్సరం

జారీ చేసిన వారు: స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం



# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 24 -11-2024 | సంపుటి - 21 | సంచిక -216 | రూ : 4 | పేజీలు: 8


# తొమ్మిది రోజులపాటు ప్రజా పాలన

- వచ్చే నెల ఒకటి నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహణ: సీఎం రేవంత్ రెడ్డి
- 4న పెద్దపల్లి సభలోగ్రూప్4కు ఎంపికైనోళ్లకు జాయినింగ్ ఆర్డర్స్
- లక్ష మంది తల్లుల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- విజయోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

హైదరాబాద్ : రాష్ట్రంలో 9 రోజులపాటు ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. 4న పెద్దపల్లి సభ వేదికగా గ్రూప్ 4 తో పాటు వివిధ జాబులకు ఎంపికైన 9 వేల మందికి నియామక పత్రాలు అందించేలా

తరువాయి 2లో






# గిరిజన యోధుడు

- ఆటుపోట్లు తట్టుకుని నిలబడ్డ హేమంత్
- 38వ ఏట తొలిసారి సీఎంగా బాధ్యతలు
- ఏడాది కాలానికే ముగిసిన పదవి
- 2019లో రెండోసారి ముఖ్యమంత్రి పీఠం
- 5 నెలలు జైలు.. ఆపై బెయిలు

రాంచి, నవంబరు 23: గిరిజన పోరాటాల వీరుడిగా ఝార్ఖండ్ గడ్డపై హేమంత్ సోరెన్ చెరగని ముద్ర వేశారు. రాష్ట్రంలో సీఎం పీఠాన్ని అధిరోహించిన చిన్న వయస్కుడిగా గుర్తింపు పొందిన ఈ జేఎంఎం నేత.. రాజకీయ కెరీర్‌లో పలు ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడ్డారు. కేంద్ర ప్రభుత్వంతో ఓ పక్క యుద్ధం

తరువాయి 2లో

# తిరగబడిన హస్తవాసి..

- 34 ఏండ్లుగా మూడంకెలకు దూరం
- మహారాష్ట్రలో కాంగ్రెస్ పతనం
- ఈసారి 20 సీట్లలోపే పరిమితం
- ఇతర రాష్ట్రాల్లోనూ అదే పరిస్థితి
- గ్యారెంటీలపై తొలగిన భ్రమలు



ముంబై, నవంబర్ 23: మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ ఘోర పరాజయాన్ని మూటకట్టుకుంది. అదే సమయంలో జార్ఖండ్‌లో ఇండియా కూటమి భాగస్వామి జేఎంఎం తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే ఈ రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఇప్పటివరకు కూటముల్లో పెద్దన్నగా వ్యవహరించిన కాంగ్రెస్‌కు ఇక భవిష్యత్‌లో ఆ స్థానం దక్కకపోవచ్చు. ఇటీవల హర్యానా ఎన్నికల్లో

తరువాయి 2లో

# అధ్యక్షుడినే చంపేయిస్తా

2లో



# నిమ్స్ హాస్పిటల్‌కు కవిత

- గురుకుల విద్యార్థినికి పరామర్శ
- ఆరోగ్య పరిస్థితిపై ఆరా

2లో



# గ్రూప్ -1పై మళ్లీ సుప్రీంకోర్టుకు..

- ప్రిలిమ్స్ 'కీ'ని సవాల్ చేస్తూ పిటిషన్
- తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదన్న టీజీపీఎస్సీ
- గూగుల్, వికీపీడియా ఆధారంగా 'కీ' రూపకల్పన
- దీనిపై అభ్యర్థుల న్యాయపోరాటం
- సోమవారం విచారణకు వచ్చే అవకాశం

హైదరాబాద్, నవంబర్ 23 : గ్రూప్ 1 పరీక్షలపై న్యాయపోరాటం చేస్తున్న నిరుద్యోగులు మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఓ వైపు హైకోర్టు మెట్లెక్కి పోరాటం చేస్తూనే మరో వైపు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే ఒక మారు జీవో29పై సుప్రీంకోర్టుకెళ్లిన అభ్యర్థులు మళ్లీ ఫైనల్ 'కీ'పై సైతం

తరువాయి 2లో



# డిసెంబర్‌లో భారీగా పెళ్లిళ్లు..

- మోగనున్న పెళ్లి బాజా
- 4, 7, 10 తేదీల్లో మంచి ముహూర్తాలు
- 7న వేలాదిగా పెళ్లిళ్లు
- డిసెంబర్ 25 వరకూ శుభ కార్యక్రమాలు

2లో



# 'ఇందిరమ్మ' ఇళ్ల సర్వేకు పైలట్ జిల్లాల ఎంపిక



- మెదక్, నిజామాబాద్, పాలమూరు, భద్రాద్రిలో సర్వే

మెదక్, నవంబరు 23 : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేకు పైలట్ ప్రాజెక్ట్ జిల్లాలుగా మెదక్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం ఎంపికయ్యాయి. సర్వే ఆధారంగా లబ్ధిదారుల వివరాలను 'ఇందిరమ్మ' యాప్‌లో నమోదు చేయనున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం తెలిపారు. మెదక్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా సర్వే నిర్వహించనున్న హవేళీఘన్‌పూర్ మండలం లింగ్‌సాన్‌పల్లి గ్రామంలో దరఖాస్తుదారుల వివరాలను రాహుల్ రాజ్ యాప్‌లో పొందుపరిచారు. లింగ్‌సాన్‌పల్లితోపాటు జిల్లాలోని నర్సాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లింగ్‌సాన్‌పల్లిలో 153, నర్సాపూర్‌లోని 5వ వార్డులో 305 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఈ జిల్లాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సర్వే జరగనుంది.

# ఏజెన్సీ గజగజ

- పాడేరు పాతబస్టాండ్ వద్ద చలి కాచుకుంటున్న స్థానికులు


2లో



# మహారాష్ట్ర ప్రగతి పథాన్ని ఎన్నుకుంది

2లో

- మహాయుతి విజయంపై పవన్ హర్షం
- ఏపీ డిప్యూటీ సీఎం ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో అభ్యర్థుల



# తొమ్మిది రోజులపాటు ప్రజా పాలన విజయోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సెక్రటేరియెట్ లో ప్రజాపాలనవిజయోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్ పాల్గొన్నారు. తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలతోపాటు భవిష్యత్తు ప్రణాళికను ప్రజలకు వివరించాలని రేవంత్ తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలన్ని వారంలో జరిగేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. శాఖలవారీగా రోజుకో మంత్రి తొలి ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల ప్రగతి నివేదికను మీడియా ద్వారా ప్రజలకు వివరించాలని సూచించారు.

**రాష్ట్రమంతటా పండుగ వాతావరణం**

సెక్రటేరియట్ పరిసరాలు, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతమంతా తెలంగాణ వైభవం వెల్లివిరిసేలా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. తెలంగాణ సంస్కృతి, కళారూపాలు ఉట్టి పడేలా డ్రోన్ షో నిర్వహించాలని సూచించారు. రాష్ట్రమంతటా అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, కాలేజీల్లోనూ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉత్సవ వాతావరణం ఉట్టిపడాలని పేర్కొన్నారు.

**తెలంగాణ తల్లి విగ్రహ పనుల పరిశీలన**

రివ్యూ తర్వాత సెక్రటేరియెట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులను సీఎం పరిశీలించారు. వచ్చే నెల 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. ఆ రోజు సాయంత్రం జరిగే ఈ వేడుకలకు తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, విద్యావంతులు, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలని అధికారులకు సీఎం సూచించారు. నియోజకవర్గానికో వెయ్యి మంది చొప్పున మహిళా శక్తి ప్రతినిధులను ఆహ్వానించి, లక్ష మంది తెలంగాణ తల్లుల సమక్షంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# తిరగబడిన హస్తవాసి..

అధికారంలోకి వస్తుందని ప్రచారం జరిగినప్పటికీ ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బోల్తా కొట్టింది. నాందేడ్, వయనాడ్ పార్లమెంట్ నియోకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వయనాడ్‌ను సులభంగా నిలబెట్టుకున్న ఆ పార్టీ నాందేడ్‌లో తన సిట్టింగ్ స్థానంలో అతికష్టంగా నెగ్గింది. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పుంజుకుంటుందని భావించినప్పటికీ ఈ ఎన్నికల్లో అత్యధికంగా దెబ్బతిన్న పార్టీ కాంగ్రెస్సేనని చెప్పవచ్చు.

ఆ రాష్ట్రంలో మునుపెన్నడూ లేనంత బలహీనంగా ఆ పార్టీ పరిస్థితి దిగజారింది. చాలా ఏండ్లుగా సీట్లు తగ్గుతూ వస్తున్న ఆ పార్టీ ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో 20 లోపు స్థానాలకే పరిమితం అయ్యింది. 288 సీట్లున్న అసెంబ్లీలో ఆ పార్టీ మిగతా కూటమి పార్టీల కన్నా అత్యధికంగా 101 సీట్లలో పోటీ చేసి 16 సీట్లలో మాత్రమే విజయం సాధించింది. అంటే కేవలం 16 శాతం సీట్లలో మాత్రమే ఆ పార్టీ విజయాన్ని సాధించగలిగింది. అదే సమయంలో కూటమి పార్టీలైన ఎన్సీపీ (ఎస్పీ) 86 సీట్లలో పోటీ చేసి 10 సీట్లు నెగ్గి 11.6 విజయం శాతాన్ని, శివసేన (యూబీటీ) 95 సీట్లలో పోటీ చేసి 20 సీట్లతో 20 విజయం శాతాన్ని పొందాయి. అధికార బీజేపీ 149 సీట్లకు 132 స్థానాల్లో విజయం సాధించి 88.6 విజయం శాతాన్ని తెచ్చుకుంది.

**34 ఏండ్లుగా మూడంకెలకు దూరం**

గత 34 ఏండ్లుగా మహారాష్ట్రలో కాంగ్రెస్ ఎన్నడూ సొంత మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు. 1990లో శరద్ పవార్ నేతృత్వంలో ఆ పార్టీ 141 స్థానాల్లో గెల్చింది. ఆ తర్వాత ఎన్నడూ కూడా ఆ పార్టీకి మూడంకెల సీట్లలో విజయం దక్కలేదు. శరద్ పవార్ కాంగ్రెస్ పార్టీని వీడి వేరే పార్టీ పెట్టుకోవడంతో 1995లో కాంగ్రెస్ 80 సీట్లకే పరిమితమై రెండోసారి అధికారానికి దూరమైంది. అప్పటివరకు కాంగ్రెస్‌కు అండగా నిలచిన మరాఠా ఓట్లను ఎన్సీపీ చీల్చింది.

ఆ తర్వాత విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో పార్టీ పుంజుకోకున్నా ఎన్సీపీతో పొత్తుతో అధికారం చేపట్టింది. 2008లో ముంబై దాడుల నేపథ్యంలో విలాస్‌రావు పదవిని కోల్పోయారు. 2009లో అశోక్ చవాన్ నేతృత్వంలో ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్ 82 సీట్లను గెల్చుకుంది. 2014లో మోదీ హవా, కాంగ్రెస్‌పై అవినీతి ఆరోపణలతో 42 సీట్లు మాత్రమే వచ్చాయి. ఇక అప్పటి నుంచి ఆ పార్టీ తేరుకోలేదు. ఈ ఎన్నికల్లోనూ అదే పరిస్థితి పునరావృతమైంది. పరిస్థితి మరింత దిగజారి ఆ పార్టీకి 20 లోపే సీట్లు వచ్చాయి.

**రాజ్యసభ సీట్లపై ప్రభావం**

కాంగ్రెస్, దాని కూటమి పార్టీల పరాజయ ప్రభావం రాజ్యసభ ఎన్నికల్లోనూ చూపించవచ్చు. అదే సమయంలో ఎగువ సభలో అధికార బీజేపీ పూర్తి మెజారిటీ దిశగా అడుగులు వేస్తున్నది. రాజ్యసభలో కూడా బీజేపీ పూర్తి మెజారిటీ పొందితే ఇక బిల్లుల ఆమోదంలో ఆ పార్టీకి ఎదురు ఉండకపోవవచ్చు.

**గ్యారెంటీలపై ప్రజల్లో తొలగిన భ్రమలు**

ఎన్నిక ఎన్నికకు కాంగ్రెస్ పరిస్థితి దిగజారుతూ వస్తున్నది. ఆ పార్టీ వ్యూహాలు వరుసగా విఫలమవుతూ వస్తున్నాయి. అది ఇస్తున్న గ్యారంటీలపై ప్రజలకు భ్రమలు తొలగాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఆ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలను మభ్యపెట్టిన అలవికాని హామీలే. ఈ విఫల ఉచిత హామీలపై హర్యానా ఎన్నికల్లో బీజేపీ ప్రచారం చేయడంతో ఓటర్లు తేరుకుని కాంగ్రెస్‌ను అధికారానికి దూరం చేశారు. దానికి తోడు పార్టీలోని నేతలు తమ పార్టీ విజయం కన్నా సీఎం పదవిపై మక్కువతోనే పనిచేయడంతో ఆ పార్టీకి మరోసారి అపజయం తప్పలేదు.

జమ్ముకశ్మీర్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ది ఇదే పరిస్థితి. దాని కూటమి నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ (ఎన్సీపీ) అధికారం చేజిక్కించుకుంది. పూర్తి మెజారిటీ రావడంతో కాంగ్రెస్ అవసరం ఆ పార్టీకి లేకుండా పోయింది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానంగా కుల గణన, అదానీఅంబానీల అంశాలే ప్రస్తావించారని, ఇది ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపలేదనివిశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# గ్రూప్ 1పై మళ్లీ సుప్రీంకోర్టుకు..

(మొదటిపేజీ తరువాయి)

తలుపుతట్టారు. ఫైనల్ కీలో అనేక తప్పులున్నాయని, తమ అభ్యంతరాలను టీజీపీఎస్సీ పట్టించుకోవడంలేదని, న్యాయం చేయాలని కోరుతూ నిరుద్యోగులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అభ్యర్థుల తరపున అడ్వకేట్ మోహిత్‌రావు పిటిషన్ వేశారు. ఈ కేసు సోమవారం విచారణకు వచ్చే అవకాశాలున్నాయి.

గ్రూప్1 ప్రాథమిక కీని టీజీపీఎస్సీ విడుదల చేయగా 1,712 మంది అభ్యర్థుల నుంచి 6,417 అభ్యంతరాలొచ్చాయి. నిపుణుల కమిటీ సూచనల మేరకు మాస్టర్ క్వశ్చన్ పేపర్‌లో ప్రశ్న నెంబర్ 56, 59ని తొలగించారు. ప్రశ్న నెంబర్ 115కు సరైన సమాధానం ఆప్షన్ 2 నుంచి 1 సరైనది సమాధానంగా మార్చారు. అయితే అభ్యర్థులు మొత్తం 13 ప్రశ్నల ఆన్సర్లపై అభ్యంతరాలు లేవదీశారు. ప్రశ్న నెంబర్లు 35, 41, 45, 59, 64, 66, 67, 79, 95, 106, 116, 119, 139పై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తెలుగు అకాడమీ పుస్తకాల్లో ఉన్న సమాచారాన్ని కోర్టుముందుంచారు. 'కీ'పై విచారణ సమయంలో టీజీపీఎస్సీ తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రమాణికం కాదని హైకోర్టుకు తెలిపింది. గూగుల్, వికీపీడియాను ప్రమాణికంగా తీసుకుని 'కీ'ని ఖరారుచేసినట్టు టీజీపీఎస్సీ కోర్టుకు తెలిపింది. ప్రభుత్వ సంస్థ ముద్రించిన పుస్తకాలు ప్రమాణికంకాదంటే ఎలా..? అంటూ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**హైకోర్టులో 15 కేసులు..**

గ్రూప్1పై దాదాపు 15 కేసులు హైకోర్టులో ఉన్నాయి. ఈ కేసుల్లో కొన్ని డివిజన్ బెంచ్, మరికొన్ని సింగిల్ బెంచ్ విచారణలో ఉన్నాయి. గ్రూప్1 మెయిన్స్ పరీక్షల సమయంలో అభ్యర్థులు జీవో 29ని సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు హైకోర్టులోని కేసు లు తేలే వరకు గ్రూప్1 మెయిన్స్ ఫలితాలు విడుదల చేయవద్దని, హైకోర్టు ఈ కేసులను త్వరగా విచారించాలని ఆదేశాలిచ్చింది. ఈ గురువారం గ్రూప్1పై గల ఐదు పిటిషన్లను విచారించిన హైకోర్టు 26న తుది విచారణ జరుపుతామని ప్రకటించింది. అభ్యర్థులు ఒక వైపు హైకోర్టులో న్యాయపోరాటం చేస్తూనే, మరో వైపు సుప్రీంకోర్టులోనూ పోరాటానికి రెడీ అయ్యారు. జీవో29 సహా ఫైనల్ 'కీ'పై గల కేసుల్లో న్యాయం తమవైపే ఉందని, రెండు కోర్టుల్లోనూ తమకే అనుకూలంగా తీ ర్పువస్తుందని అభ్యర్థులు ధీమాగా ఉన్నారు.

# మహారాష్ట్ర ప్రగతి పథాన్ని ఎన్నుకుంది

అమరావతి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమికి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ ఘన విజయం ప్రధాని మోదీ దూరదృష్టి గల నాయకత్వంపై మహారాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. మహాయుతి అభ్యర్థులకు మద్దతుగా మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం గర్వకారణమని తెలిపారు. మహారాష్ట్రలోని తెలుగువారి అభివృద్ధి, సంక్షేమం కోసం కొత్త ప్రభుత్వం కృషి చేయాలని, మహారాష్ట్రఏపీ మధ్య పరస్పర సహకారాన్ని కొనసాగించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

**వంద శాతం స్టైక్‌రేట్**

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి మద్దతుగా ప్రచారం చేసిన అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. డేగ్లూర్, భోకర్, లాతూర్, షోలాపూర్ నగరంలోని మూడుస్థానాలు, బల్లార్‌పూర్, చంద్రాపూర్, పుణె కంటోన్మెంట్, హడ్సర్‌పూర్, కస్బాపేట్ నియోజకవర్గాల్లోని మహాయుతి అభ్యర్థులను గెలిపించాలని పవన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో అన్నింటా విజయం దక్కడంతో మరోసారి 100 శాతం స్ట్రైక్‌రేట్ అందుకున్నారు.

# డిసెంబర్‌లో భారీగా పెళ్లిళ్లు..
# మోగనున్న పెళ్లి బాజా

(మొదటిపేజీ తరువాయి)

పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తోంది. బ్రహ్మచారులు కొత్త బంధంలో ఒదిగిపోయేందుకు సిద్ధమవుతున్నారు. కన్నెపిల్లలు సిగ్గుల మొగ్గలవుతూ ముస్తాబులకు రెడీ అవుతున్నారు. పెళ్లి ఏర్పాట్లకు వధూవరుల కుటుంబాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నాయి. నగలు, వస్త్రాలు, కల్యాణ మండపాలు, సన్నాయి, కేటరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. నగలు, వస్త్ర దుకాణాల్లో అప్పుడే షాపింగ్ కళ పెరిగిపోయింది. పెళ్లి బంధం ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత కీలకమైంది. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఆచితూచి శుభఘడియలను ఎంచుకుని ముడేస్తారు. తద్వారా వారి వివాహ బంధం జీవితకాలం ఎలాంటి ఆటుపోట్లకు లోనవకుండా ఉండాలని కోరుకుంటారు.

**మార్గశిరం మంచిదని..**

మార్గశిర (డిసెంబర్) మాసంలో మళ్లీ పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈ మాసంతో పాటు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో కూడా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. మార్గశిర మాసంలో బలమైన ముహూర్తాలు ఉండటంతో పాటు జనవరిలో పుష్యమాసం కావడం.. మార్చి రెండో వారం నుంచి శుక్ర మౌఢ్యమి (మూఢం) రానుండటంతో ఇప్పుడున్న ముహూర్తాల్లోనే పెళ్లిళ్లు చేయాలని పెద్దలు ఆరాటపడుతున్నారు.

ప్రస్తుత కార్తీక మాసంలో ఈ నెల 24న చివరి ముహూర్తం ఉంది. కార్తీకంలో పెళ్లిళ్లు జరిగినా పెద్దగా లేవనే చెప్పాలి. డిసెంబర్ 2వ తేదీ నుంచి మార్గశిర మాసం మొదలు కానుండటంతో వివాహాలు అధిక సంఖ్యలో జరగనున్నాయి. తెలుగునాట మాఘం, వైశాఖం, శ్రావణ మాసాల తరువాత మార్గశిర మాసంలోనే ఎక్కువగా వివాహాలు జరుగుతుంటాయి.

**జనవరిలో ముహూర్తాలు లేవు**

డిసెంబర్ 25 తరువాత నుంచి జనవరి 30వ తేదీ వరకూ పుష్యమాసంలో వివాహాలు, ఇతర శుభ కార్యక్రమాలు పెద్దగా చేయరు. జనవరి 31 నుంచి మార్చి 7వ తేదీ వరకూ మాఘమాసంలో ముహూర్తాలున్నాయి. మార్చి 13 నుంచి శుక్ర మౌఢ్యమి (మూఢం) మొదలు కానుండటంతో ముహూర్తాల కోసం మళ్లీ నెల రోజులకు పైగా ఎదురుచూపులు తప్పవు. ఈ కారణాలతో మార్చి 7లోపు పెళ్లిళ్లు చేసేందుకు చాలామంది ఆరాటపడుతున్నారు.

**7న అతి పెద్ద ముహూర్తం**

డిసెంబర్ నెల పొడవునా ముహూర్తాలున్నాయి. ఆ నెలలో ఏడో తేదీ అతి పెద్ద ముహూర్తం. ఆ రోజున సుమారు 30 పెళ్లిళ్లకు ముహూర్తాలు పెట్టాను. డిసెంబర్ 22వ తేదీ ఆదివారం సైతం పెద్దఎత్తున పెళ్లిళ్లు జరగనున్నాయి. జనవరిలో పుష్యమాసం కావడంతో పెద్దగా ముహూర్తాలు లేవు. ఈ కారణంగా డిసెంబర్‌లో ఎక్కువగా వివాహాలు జరగనున్నాయి. దైవజ్ఞరత్న ఉపద్రష్ట నాగాదిత్య సిద్ధాంతి, అమలాపురం

**25 వరకూ శుభముహూర్తాలు**

మార్గశిర మాసంలో డిసెంబర్ 4వ తేదీ బుధవారం బలమైన ముహూర్తాలున్నాయని పురోహితులు, సిద్ధాంతులు చెబుతున్నారు. ఆ రోజు రాత్రి 7.54 గంటలకు, తెల్లవారుజామున 4.28 గంటలకు (తెల్లవారితే గురువారం), అలాగే 5, 6 తేదీల్లో ముహూర్తాలున్నాయి. 7వ తేదీన కూడా అతి పెద్ద ముహూర్తాలున్నాయి.

ఆ రోజు రాత్రి 7.50, తెల్లవారుజామున 4.24 (8వ తేదీ ఉదయం) రికార్డు స్థాయిలో పెళ్లిళ్లు జరగనున్నాయి. అలాగే, 10వ తేదీన సైతం అధిక సంఖ్యలో వివాహాలు చేయనున్నారు. డిసెంబర్ 11, 14, 20, 22, 24, 25 తేదీల్లో పెళ్లిళ్లతో పాటు, వివిధ శుభ కార్యక్రమాలకు సైతం మంచి ముహూర్తాలు ఉన్నాయి.

# నిమ్స్ హాస్పిటల్ కు కవిత

హైదరాబాద్: ఎమ్మెల్సీ కవిత నిమ్స్‌హాస్పిటల్‌కు వెళ్లారు. కుమ్రంభీం అసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ స్టూడెంట్లకు క్వాలిటీ ఫుడ్‌అందించాలన్నారు. విద్యార్థులు ధర్నా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శైలజ పరిస్థితి విషమంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# ఏజెన్సీ గజగజ

(మొదటిపేజీ తరువాయి)

ఏజెన్సీ ప్రాంతంలో సాయంత్రం 4గంటల నుంచే చలిగాలులు విజృంభిస్తున్నాయి. పాడేరు ఘాట్‌లో చలితీవ్రత మరింత ఎక్కువైంది. శనివారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీ బోర్డులో 10 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 14.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏజెన్సీవ్యాప్తంగా ఉదయం 10గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. సాయంత్రం నుంచే అన్ని వర్గాల ప్రజలు చలిమంటలను ఆశ్రయించారు. ఘాట్ ప్రాంతాల్లో చలి మరింత ఇబ్బంది పెడుతోంది.

# అధ్యక్షుడినే చంపేయిస్తా

**నా ప్రాణాలను హాని జరిగితే ఎవ్వరినీ వదలను**

**అధ్యక్షుడి భార్యను, దిగువసభ స్పీకర్‌నూ అంతం చేస్తా**

**ఫిలిప్పీన్స్ ఉపాధ్యక్షురాలి సంచలన ప్రకటన**

మనీలా: ఆగ్నేయాసియా దేశం ఫిలిప్పీన్స్‌లో రెండు శక్తివంత రాజకీయ కుటుంబాల మధ్య మళ్లీ అగ్గిరాజుకుంటోంది.

ఈ కుటుంబాల మధ్య పాత వైరం మరోసారి బట్టబయలైంది. తన ప్రాణానికి ముప్పు వాటిల్లితే ఫిలిప్పీన్స్ దేశాధ్యక్షుడు ఫెర్డినాడ్ మార్కోస్ జూనియర్‌ను చంపేస్తానని ఉపాధ్యక్షురాలు సారా డ్యుటెర్టే బహిరంగ ప్రకటన చేసి దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించారు.

సారా డ్యుటెర్టే తండ్రి రోడ్రిగో డ్యుటెర్టేకు, ఫెర్డినాడ్ తండ్రి మార్కోస్ సీనియర్‌కు మధ్య చాన్నాళ్ల క్రితం బద్ధశత్రుత్వం ఉన్న విషయం తెల్సిందే. ఫెర్డినాడ్ జూనియర్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా రాజీనామాచేసినప్పటికీ సారా ఇంకా దేశ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఇటీవలికాలంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అస్సలు పొసగట్లేదు. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున సారా ఆన్‌లైన్‌లో మీడియాసమావేశంలో మాట్లాడారు.

''నా యోగక్షేమాల గురించి ఎవరికీ ఎలాంటి భయాలు అక్కర్లేదు. అయితే మీకో విషయం చెప్తా. ఇటీవల నేను ఒక కాంట్రాక్ట్ కిల్లర్‌తో మాట్లాడా. నా ప్రాణాలను హాని ఉండి, నన్ను ఎవరైనా చంపేస్తే వెంటనే దేశాధ్యక్షుడు ఫెర్డినాడ్, ఆయన భార్య లిజా అరనేటా, పార్లమెంట్‌లో ప్రతినిధుల సభ స్పీకర్ మారిటెన్ రోమాల్డేజ్‌ను చంపేసెయ్. ప్రాణాలు పోయాయని నిర్ధారించుకునేదాకా దాడిచెయ్ అని చెప్పా. అందుకే తను సరేనన్నాడు. ఇది సరదాకి చెప్పట్లేను. ఇది జోక్ కానేకాదు''అని సారా చెప్పారు.

అధ్యక్షుడిని అంతం చేయాలని కాంట్రాక్ట్ కిల్లర్‌తో మాట్లాడినట్లు స్వయంగా ఉపాధ్యక్షురాలే ప్రకటన చేయడంతో అధ్యక్షుడి కమ్యూనికేషన్స్ కార్యాలయం అప్రమత్తమైంది. ''అధ్యక్షుని ప్రాణాలకు ఇంతటి హాని పొంచి ఉందని తెలిశాక భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నాం. రక్షణ బాధ్యతలను అధ్యక్షుడి రక్షణ దళాలకు అప్పజెప్తున్నాం. సారా వ్యాఖ్యలపై తగు చర్యలకు సిద్ధమవుతున్నాం''అని కార్యనిర్వాహక కార్యదర్శి లూకాస్ బెర్సామిన్ చెప్పారు. 2022 మేలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా మార్కోస్, ఉపాధ్యక్షురాలిగా సారా పోటీచేసి ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే.

వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలో చైనా ఆధిపత్య ధోరణులు, తదితర అంతర్జాతీయ, దేశీయ అంశాల్లో ఇద్దరు నేతల మధ్య ఇటీవలికాలంలో తీవ్ర బేధాభిప్రాయాలొచ్చాయి. ఈమధ్య ఓసారి అధ్యక్షుడి తలను నరుకుతున్నట్లు ఆలోచనలొస్తున్నాయని సారా వ్యాఖ్యానించారు. ''అధ్యక్షుడు అవినీతిలో కూరుకుపోయారు. పరిపాలించే సత్తా లేదు. అబద్ధాలకోరు. మా కుటుంబాన్ని రాజకీయంగా బలహీనపరచాలని కుట్ర పన్నుతున్నారు''అని సారా ఆరోపించారు. సారా తండ్రి రోడ్రిగో డ్యుటెర్టో ఫిలిప్పీన్స్‌లో కరడుగట్టిన రాజకీయనేతగా పేరొందారు.

దేశంలో మాదకద్రవ్యాల ముఠాలపై ఉక్కుపాదం మోపారు. దావో సిటీ మేయర్‌గా, ఆతర్వాత దేశాధ్యక్షుడిగా తన పరిపాలనాకాలంలో 'డెత్ స్క్వాడ్'పేరిట వేలాది మంది డ్రగ్స్‌ముఠా సభ్యులను అంతమొందించారు. ఆనాడు దేశాధ్యక్షుడిగా ఉంటూ మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఆయన అంతర్జాతీయ న్యాయస్థానంలో కేసు విచారణను ఎదుర్కొంటున్నారు. సారా ప్రకటనపై దేశ సైన్యాధ్యక్షుడు జనరల్ రోమియో బ్రేవ్‌నర్ ఒక ప్రకటన విడుదలచేశారు. ''లక్షన్నరకుపైబడిన దేశ సైనికులు ఎల్లప్పుడూ పక్షపాతరహితంగా పనిచేస్తారు. ప్రజాస్వామ్యయుత రాజ్యాంగబద్ధ సంస్థలు, పౌరవ్యవస్థల ఆదేశాలను శిరసావహిస్తారు''అని అన్నారు.

# గిరిజన యోధుడు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తూనే.. మరో పక్క పార్టీలో అంతర్గత పోరును కూడా తట్టుకుని మూడోసారి విజేతగా నిలిచారు. నిరంతర పోరాటాలే ఆయన్ని మరోసారి సీఎం పీఠంపై కూర్చోబెట్టాయి. 1975 ఆగస్టు 10న హజారీబాగ్ సమీపంలోని నేమ్రా గ్రామంలో హేమంత్ జన్మించారు. తండ్రి, ఝార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత శిబు సోరెన్ ప్రభావం ఆయనపై ఉండేది. పాట్నా హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్ చదివిన హేమంత్.. రాంచీలోని బిట్స్‌లో చేరి మధ్యలోనే చదువుకు స్వస్తి పలికారు. శిబు సోరెన్ రాజకీయ వారసుడిగా హేమంత్ అన్న దుర్గ రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. 2009లో దుర్గ అకాల మరణంతో హేమంత్ రాజకీయ అరంగేట్రం చేశారు.

**2013లో తొలిసారి సీఎం పదవి**

నిజానికి హేమంత్ కెరీర్ అంత సాఫీగా సాగలేదు. 2009లో రాజ్యసభ సభ్యుడిగా తొలిసారి పదవి చేపట్టారు. ఆ పదవికి 2010లో రాజీనామా చేసి బీజేపీ నేతృత్వంలోని అర్జున్ ముండా ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కూటమి విచ్ఛిన్నంతో 2012లో ప్రభుత్వం కూలిపోయి వెంటనే రాష్ట్రపతి పాలన వచ్చింది. ఆ తర్వాత 2013లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి 38 ఏళ్లకే తొలిసారి సీఎం పీఠాన్ని అధిరోహించారు. ఆ సమయంలో ఆయనకు కాంగ్రెస్, ఆర్జేడీ మద్దతునిచ్చాయి. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో హేమంత్ తొలి విడత సీఎం పదవి కొద్ది కాలానికే ముగిసిపోయింది. ప్రతిపక్ష నేతగా ఆయన అసెంబ్లీలో కూర్చోవలసి వచ్చింది.

# వైష్ణవి టెక్నో స్కూల్ లో ఘనంగా ఫుడ్ ఫెస్ట్ 2024









జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్లో శనివారం ఫుడ్ ఫెస్ట్ 2024 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీసుకవచ్చిన పలు రకాల ఆహర పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం అట్టి ఆహార పదార్థాలను విద్యార్థుల తల్లిదండ్రులు స్వీకరించి చాలా రుచిగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ సి.హెచ్.నర్సింహులు గౌడ్ పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల వంటకాలను తిలకించి వాటిలో ఉపయోగించిన ఆహార పదార్థాలను, పోషక విలువల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సి.హెచ్. నర్సింహులు గౌడ్ మాట్లాడుతూ మనం తీసుకునే ఆహరంలో ఉండే పోషక విలువల గురించి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రతి ఒక్కరు నిత్యం పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతో ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. చిన్నారులు ప్రదర్శించిన పలు రకాల ఆహార పదార్థాలను చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సాయిబాబా, గాజులరామారం బ్రాంచ్ ప్రిన్సిపాల్ మహేష్, పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శపాఠశాల వసతి గృహాన్ని తనిఖీ చేసిన అధికారులు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారం గ్రామంలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని భువనగిరి డివిజన్ అధికారిణి డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శిల్పి, మండల వైద్యాధికారి డాక్టర్ కాటంరాజు, వైద్య సిబ్బందిలతో కలిసి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకొని మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తాజా కూరగాయలను విద్యార్థులకు వండి వడ్డించాలని సూచించారు. విద్యార్థుల వసతి గదులను,వాష్ రూమ్స్, స్టోర్ రూమ్, వస్తువుల ఎక్స్పైరీ తేదీలను, తాగు నీటిని, మౌలిక వసతులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్ కేర్ టేకర్ విద్యార్థుల పట్ల తీసుకుంటున్న శ్రద్ధను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, తాగునీరు, ఆహారం, హాస్టల్ పరిశుభ్రత వంటి వాటి పై పరిశీలన చేసిన అధికారులు కేర్ టేకర్ మల్లికను అభినందించారు. అలాగే ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్నం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని కూడా పరిశీలించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు శుభ్రమైన ఆహారాన్ని అందించాలని ప్రిన్సిపాల్ అజారాయ్యకు సూచించారు. పాఠశాల చుట్టుపక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులకు, హాస్టల్ కేర్ టేకర్ కు సూచించారు. అనంతరం విద్యార్థులకు మండల వైద్యాధికారి కాటమరాజ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య సేవలు అందించి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కాటమరాజు, డాక్టర్ జయంత్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సౌజన్య, సూపర్వైజర్స్ సత్యనారాయణ, స్టాఫ్ నర్స్, ఫార్మాసిస్టులు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

## మహారాష్ట్రలో విజయంతో బీజేపీ సంబరాలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మహారాష్ట్రలో బీజేపీ విజయం సాధించడంతో.. బీజేపీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో జాతీయ రహదారిపై శనివారం సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. మహారాష్ట్రలో మరోసారి పట్టం కట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రజలు దేశమంతా భారతీయ జనతా పార్టీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని బిజెపి నాయకులంతా ముక్తకంఠంతో తెలిపారు. భారత దేశానికి బీజేపీ శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో దూడల బిక్షం గౌడ్, రమణగోని శంకర్, పోలోజు శ్రీధర్ బాబు, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేష్ యాదవ్, గుజ్జుల సురేందర్ రెడ్డి, బత్తుల జంగయ్య గౌడ్, దాసోజు బిక్షమాచారి కాసుల వెంకటేశం, ముత్యాల భూపాల్ రెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి ఉబ్బు బుచ్చయ్య, కట్ట కృష్ణ, బుడ్డా సురేష్, వనం ధనుంజయ, కడారి ఐలయ్య, పక్కీరు శ్రీనివాసరెడ్డి, లగ్గోని పాండు గౌడు, పబ్బు వంశీ, కాయితి ముత్యాలు, పర్నె శేఖర్ రెడ్డి, కానుగు కొండల్, కానుగు శేఖర్, బొలమోని శ్రీశైలం, పోలోజు భాస్కర్, దామోదర్ రెడ్డి, కృష్ణ, బాతరాజు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా పాలన కళాయాత్ర



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి ) :తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు 2024లలో భాగంగా శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 'తెలంగాణ సాంస్కృతిక సారథి ' కళాకారుల 2 బృందాలు "ప్రజా పాలన కళాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపాలిటీ శామీర్ పేట్ , బాబాగూడ, బొమ్మరాసిపేట పరిసర ప్రాంతాలలో , దుండిగల్ మున్సిపల్ పరిధిలోని మల్లంపేట్ , బౌరంపేట్ , శంబీపూర్ లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల పై పాటలతో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కమీషనర్ కే.సత్యనారాయణ, మేనేజర్ సునంద, రాంచందర్, రవీందర్ రెడ్డి, పెంటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ లో ఘనంగా ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బీఆర్ఎస్ నాయకుడు డా ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ పుట్టిన రోజు వేడుకలను మునుగోడు నియోజకవర్గ నాయకులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. చౌటుప్పల్ పట్టణంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆందోజు శంకరా చారి ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ హాజరై కేకు కట్ చేసి పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డికి తినిపించారు. అనంతరం రక్తదాన శిబిరం ప్రారంభించారు. మొదటగా బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డిల్లీ మాధవరెడ్డి రక్తదానం చేశారు. రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షులు సుర్వీ యాదయ్య గౌడ్, స్థానిక మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ తాడురి పరమేష్, మల్లారెడ్డి గూడెం సర్పంచ్ కొండ శ్రీనివాస్ గౌడ్, బి ఆర్ ఎస్వీ ఇన్చార్జి నలపరాజు రమేష్, తెలంగాణ ఉద్యమ నాయకులు శ్రీరాముల నరసింహ, నీళ్ళ లింగుస్వామి, రఘు గౌడ్, చంద్రశేఖర్ మరియు పెద్దఎత్తున స్థానిక యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పల్లె రవికుమార్ మాట్లాడుతూ డా. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ గొప్ప దార్శనిక నాయకులని, కెసిఆర్ పాలనలో పేద బిడ్డల కు గొప్ప విద్యను, ఉద్యగాలను, అవకాశాలను కల్పించడంలో గొప్ప పాత్ర పోషించారని కొనియాడారు. చింతల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో ఉన్నత పాత్రను పోషించబోతున్నారని జోస్యం చెప్పారు. అందోజు శంకరా చారి మాట్లాడుతూ ఆర్ ఎస్పీ కి మునుగోడు ఉపఎన్నిక ద్వారా ప్రత్యేక అనుభందం ఉన్నదని, ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో కెసిఆర్ కేటీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ అసమర్థ పాలనపై క్రియాశీలక ఉద్యమాలను చేయటంలో గొప్ప పాత్ర పోషిస్తున్నారని, త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతతో దిగిపోయి కెసిఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. జిల్లా బిఆర్ ఎస్ నాయకులు పూదరి సైదులు మాట్లాడుతూ రానున్న ప్రభుత్వంలో డా. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఉప ముఖ్యమంత్రిగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికై పనిచేస్తారని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల, ఎంపీటీసీ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు నర్రా నిర్మల, పోకల ఎలిజబెత్, వేముడాల రాణి, అంజన్ కుమార్, పుదారు కృష్ణ, చిలకరాజు శివ, నాగేంద్రబాబు, కడారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

* **కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి ) : అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అన్నారు. శనివారం వివేకానంద నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర నగర్ మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, వెంకటేశ్వర నగర్ రోడ్ నెంబర్ 14 లో జరుగుతున్న మురుగునీటి పైపులైను (సీవరేజ్ ), రిక్షా పుల్లర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్ లలో జరుగుతున్న పనులను కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు సంబంధిత అధికారులు , కాలనీ వాసులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వెంకటేశ్వర్ నగర్ రోడ్ నెంబర్ 13, 14, 21 లలో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులను వీలైనంత తొందరగా ప్రారంభించి ఇప్పుడు జరుగుతున్న పనులను ఎక్కడ కూడా నాణ్యత తగ్గకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ శ్రావణి, హెచ్ఎండబ్ల్యూఎస్ , ఎస్ బి మేనేజర్ ప్రియాంక, స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, లింగయ్య, సోమయ్య, నర్సింలు, రమేష్ రావు, సోమేష్, వెంకటేశ్వరరావు, శ్యామ్, రామచందర్, నరేష్, మహేష్, రవి, రాజు, చానప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్ చంద్ హీరాచంద్ జయంతి వేడుకలు

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : హెచ్.ఎ.ల్ ఫౌండర్ సేట్ వాల్ చంద్ హీరాచంద్ 142 వ జయంతిని శనివారం బాలానగర్ ప్రాంతంలోని హెచ్.ఎ.ల్ పరిశ్రమలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పరిశ్రమ సౌత్ గేట్ వద్ద నున్న విగ్రహానికి హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ హీరాచంద్ 1882 బొంబాయిలో జన్మించిన అయన హెచ్.ఎ.ల్ పరిశ్రమని స్థాపించి ఈరోజు పరిశ్రమ భారత దేశంలో అనేక రాష్ట్రాలలో వేలమంది కార్మికులతో పనిచేస్తుందన్నారు. ఇటీవల కార్మికుల కృషి వల్ల నవరత్న స్టేటస్ నుండి మహరత్న స్టేటస్ వచ్చిందని వక్తలు తెలిపారు. వాల్ చంద్ హీరాచంద్ సేవలు మరువలేనివని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎ.డబ్ల్యూ యూనియన్ గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అన్వార్, కర్కనాగరాజు పాల్గొన్నారు.

## అధికారులకు రివార్డులను అందజేసిన రాష్ట్ర డీజీపీ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం పోలీస్ స్టేషన్లో గంజాయి అక్రమ రవాణా కేసుల్లోని నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సై శ్రీకాంత్ కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుధీర్ లకు శనివారం రాష్ట్ర డీజిపి డా.జితేందర్ తమ కార్యాలయంలో రివార్డులను అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి చేతుల మీదుగా అ రివార్డులను అందుకున్న అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు.2023 సంవత్సరంలో ప్రభుత్వం నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేవిధంగా కృషి చేసిన అప్పటి ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి,ఎస్సై శ్రీకాంత్ , కోర్టు డ్యూటీ ఆఫీసర్ సుదీర్ లు శనివారం డీజీపీ కార్యాలయంలో రివార్డులను అందుకున్నారు.భద్రాచలం పోలీస్ స్టేషన్ లో 480 కిలోల నిషేధిత గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు ముద్దాయిలకు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష , ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా ,భద్రాచలం పోలీస్ స్టేషన్ లో 484 కిలోల నిషేధిత గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు ముద్దాయిలకు 12 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి లక్ష రూపాయలు జరిమానా పడేవిధంగా కోర్టు వారికి సాక్షాధారాలను సమర్పించి సమర్ధవంతంగా పనిచేసినందుకు గాను వీరి ప్రతిభను గుర్తించి ఇట్టి రివార్డులను అందజేయడం జరిగింది. వీరి ముగ్గురితో పాటు నేరస్తులకు శిక్ష పడేవిధంగా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయకుమార్ ని కూడా జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

# వైకల్యం శరీరానికే తప్ప మనస్సుకు, ఆలోచనకు కాదు

* జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజాస్ఫూర్తి,ఖమ్మం : వైకల్యం శరీరానికే తప్ప మనస్సుకు, ఆలోచనకు కాదని నిరూపించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టర్ స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల ఆటల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. క్రీడా పార్టీలలో పాల్గొనేందుకు వచ్చిన ప్రతి ఒక్క దివ్యాంగుడిని పలకరిస్తూ, వారికి కరచలనం చేస్తూ, సెల్ఫీ ఫోటోలు దిగుతూ వారి సంతోషంలో పాలు పంచుకున్నారు. దివ్యాంగులను ఉత్సాహపరిచేందుకు క్యారమ్స్ క్రీడా పోటీల్లో కలెక్టర్ సైతం పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి ఏదో ఒక సమయంలో వైకల్యంతో బాధ పడతారని కానీ ఆ వైకల్యం మన లక్ష్య సాధనలో అడ్డు కావద్దని తెలిపారు. దివ్యాంగులు ఇతరులకు ఏ విధంగా కూడా తీసిపోకుండా తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తున్నారని, వారు క్రీడల్లో చూపిస్తున్న ప్రతిభ, స్ఫూర్తి అందరికీ ఆదర్శమని అన్నారు. క్రీడా



పోటీలలో దివ్యాంగులు ట్రై సైకిల్, పరుగు, చెస్, క్యారమ్స్, షార్ట్ ఫుట్ ఆటలు ఆడారు. గెలుపొందిన క్రీడాకారులకు క్రీడల్లో పాల్గొన్న వారందరికీ డిసెంబర్ 3న జరిగే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు కలెక్టర్ భోజనం వడ్డించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి,జిల్లా క్రీడలు,యువజన సర్వీసుల అధికారి సునీల్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మరాఠా ప్రజలు రేవంత్ అసత్య ప్రచారం నమ్మలేదు

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**తెలంగాణ బ్యూరో:** దేశ భవిష్యత్‌కు ప్రాంతీయ పార్టీలే బలమైన పునాదులనే విషయం మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఫలితాలతో తేలిపోయిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బలమైన ప్రతిపక్షంగా కూడా నిలవలేని కాంగ్రెస్ దేశంలో ప్రాంతీయ పార్టీలను నాశనం చేస్తోందని ఆక్షేపించారు. ఈ మేరకు బిఆర్ఎస్సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. "కాంగ్రెస్ చేతగానీ, అసమర్థత కారణంగానే భాజపా మనుగడ కొనసాగుతోంది. ప్రాంతీయ పార్టీల కృషిని విస్మరిస్తూ జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపాలు సిగ్గు లేకుండా విమర్శలు చేస్తున్నాయి. సీఎం రేవంత్ ఘోర ఓటమి నుంచి కాంగ్రెస్‌ను కాపాడలేకపోయింది. ఆయన అసత్య ప్రచారాన్ని మరాఠా ప్రజలు నమ్మలేదు. ఇకనైనా తెలంగాణలో గెలిపించిన ప్రజల కోసం, వాళ్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చటం కోసం రేవంత్ పనిచేయాలి. ఏడాది క్రితం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుపై దృష్టి పెట్టాలి. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలనే కుట్రలో కాంగ్రెస్ ఎక్కువ కాదు.. బీజేపీ తక్కువ కాదు"అని కేటీఆర్ పేర్కొన్నారు.



## మహారాష్ట్రలో హ్యాట్రిక్ విజయం సాధించాం

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- కాంగ్రెస్ మరో సారి నవ్వులపాలు

**తెలంగాణ బ్యూరో:** దేశ ప్రజల ముందు కాంగ్రెస్ మరోసారి నవ్వుల పాలైందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మహారాష్ట్ర ప్రజలు బీజేపీ కి మంచి మెజార్టీ కట్టబెట్టారన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాహుల్‌గాంధీ మహారాష్ట్రలో విద్వేష ప్రచారం చేశారు. కులం, మతం పేరుతో ప్రజలను విడగొట్టాలని చూశారు. కానీ, ఇండియా కూటమికి మహారాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. ఈ విజయంతో భాజపా మహారాష్ట్రలో హ్యాట్రిక్ కొట్టింది. గత ఎన్నికల్లో ప్రజా తీర్పును ఉద్ధవ్ ఠాక్రే వంచించారు. అనేక రాష్ట్రాల్లో రెండోసారి అధికారంలోకి వచ్చాం. కాంగ్రెస్ 3 రాష్ట్రాలకే పరిమితమైంది" అని అన్నారు.

## ఇన్‌స్టాగ్రామ్ 56 లక్షల మంది ఫాలోవర్లు.. ఎన్నికల్లో 92 ఓట్లు..



**నేషనల్ బ్యూరో:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. ఈ ఎన్నికల్లో వెర్సోవా స్థానం నుంచి పోటీ చేస్తున్న బిగ్ బాస్ మాజీ కంటెస్టెంట్, యాక్టర్ అజాజ్ ఖాన్‌కి ఓటర్లు షాక్ ఇచ్చారు. అజాజ్ ఖాన్ నోటా ఓట్ల కంటే వెనకబడి ఉన్నారు. ఎర్లీ ట్రెండ్స్‌లో నోటాకు 500 ఓట్లు వస్తే, అజాజ్ ఖాన్‌కి 100 కన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. అజాజ్ ఖాన్ ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీ రామ్) టికెట్‌పై ఎన్నికల్లో పోటీ చేశారు. యూపీలోని నగీనా ఎంపీగా ఉన్న చంద్రశేఖర్ ఆజాద్ 'రావణ్' ఈ పార్టీకి నేతృత్వం వహిస్తున్నారు. వెర్సోవా సీట్ నుంచి అజాజ్ ఖాన్‌తో పాటు బీజేపీ నుంచి భారతీ లవేకర్, శివసేన ఠాక్రే నుంచి హరూన్ ఖాన్ పోటీ చేశారు.



## అభివృద్ధే మహాయుతికి మళ్లీ పట్టం

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ
- డబుల్ ఇంజన్ సర్కార్ తో మరింత డెవలప్మెంట్

**నేషనల్ బ్యూరో:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమికి ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ ఎలాంటి పోటీ ఇవ్వలేకపోయింది. ఈ నేపథ్యంలో బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. మహాయుతి కూటమి నేతలందరికీ అభినందనలు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహారాష్ట్ర అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని, అందుకే మహారాష్ట్ర ప్రజలు మరోసారి పట్టం కడుతున్నారని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.' మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతికి చరిత్రాత్మక విజయం అందించిన ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు. ప్రజల ఆకాంక్షలకు కట్టుబడి, మహారాష్ట్ర సమగ్ర పురోగతికి ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది'' అని గడ్కరీ పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి మరింత ఉన్నత స్థాయికి చేరుతుందని అన్నారు. ఇంతటి ఘనవిజయం కోసం శ్రమించిన ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా జాతీయ అధ్యక్షుడు నడ్డా, సీఎం ఏక్‌నాథ్ శిండే, డిప్యూటీ సీఎం ఫడణవీస్, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్, భాజపా, మహాయుతి నేతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## భద్రాచలం రామయ్య ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- 68 కోట్లతో మొదటి విడత నిధులతో పనులు



**తెలంగాణ బ్యూరో:** ఇందిరమ్మ రాజ్యంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని డెవలప్మెంట్ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మంత్రి పొంగులేటి ఆలయ అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. తొలుత ఆలయం వద్దకు వచ్చిన మంత్రికి మంగళ వాయిద్యాలు, పూలమాలలతో ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంలోని సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి ఉపాలయంలోని లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు. అనంతరం భద్రాచలంలోని ఏఎంసీ కాలనీలో గతంలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. అక్కడ కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. లెక్కల్లో చాలా తేడాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో భద్రాచలం అభివృద్ధిపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా మొదటి విడత రూ.68 కోట్లతో స్థల పరిశీలన పనులు త్వరలోనే మొదలు పెడతామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో మరిన్ని నిధులను మంజూరు చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

అమరావతి విశాఖపట్నం: దక్షిణ అండమాన్ సముద్రంఆగ్నేయ బంగాళాఖాతంపై విస్తరించిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమవాయవ్య దిశగా పయనిస్తూ దక్షిణ బంగాళాఖాతంలో 25న వాయుగుండంగా బలపడే సూచనలున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. అనంతరం వాయవ్య దిశగా కదులుతూ తదుపరి రెండు రోజుల్లో తమిళనాడుశ్రీలంక తీరాల వైపు వెళ్లి.. తీరం దాటనుందని వెల్లడించారు. దీని ప్రభావంతో నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో 27 నుంచి మూడురోజుల పాటు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం తీరం వెంబడి గంటకు 35 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయనీ.. వాయుగుండంగా బలపడిన తర్వాత గాలుల ఉద్ధృతి పెరగనుందన్నారు. 26వ తేదీ నుంచి దక్షిణ కోస్తా తీరం వెంబడి గరిష్టంగా 65 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని 29వ తేదీ వరకూ మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.



## కేదార్‌నాథ్‌లో బీజేపీ విజయం

- మూడోసారి గెలిచిన ఆశా నౌటియాల్
- ఉప ఎన్నికల్లో సత్తా చాటిన బీజేపీ

**నేషనల్ బ్యూరో:** ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ లో జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ విజయం సాధించింది. ఆ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ఆశా నౌటియాల్ గెలుపొందారు. 5622 ఓట్ల తేడాతో ఆమె విక్టరీ కొట్టారు. ఆశాకు 23814 ఓట్లు పోలయ్యాయి. సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి మనోజ్ రావత్‌కు 18192 ఓట్లు పడ్డాయి. జ్యోతిర్లింగ క్షేత్రం కేదార్‌నాథ్‌లో.. బీజేపీ అభ్యర్థి గెలవడం పట్ల సీఎం పుష్కర్ సింగ్ థామీ సంతోషం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వ చేపట్టిన అభివృద్ధి పనులపై కేదార్‌నాథ్ ప్రజలు విశ్వాసం చూపినట్లు సీఎం తన ట్వీట్‌లో వెల్లడించారు. పవిత్ర భూమి కేదార్‌నాథ్ గురించి తప్పులు ప్రచారం చేసే వారికి ఇది గట్టి కౌంటర్ అని ఆయన పేర్కొన్నారు. కేదార్‌నాథ్ అసెంబ్లీ సీటు నుంచి ఇప్పటి వరకు అయిదుసార్లు మహిళలు ఎమ్మెల్యేగా గెలిచారు. 2002 విధాన సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా ఆశా నౌటియాల్ విజయం సాధించారు. ఆ తర్వాత 2007లో కూడా ఆమే విక్టరీ కొట్టారు. ఇక 2012లో కాంగ్రెస్ అభ్యర్థి శైలా రాణి రావత్ ఆ స్థానం నుంచి గెలుపొందారు. అయితే 2022లో శైలా రాణి.. బీజేపీ సీటుపై పోటీ చేసి విజయం సాధించారు. ఆమె మృతిచెందడంతో శైలా రాణి స్థానం ఆశా నౌటియాల్ పోటీ చేసి గెలుపొందారు. దీంతో అయిదోసారి ఆ స్థానం నుంచి మహిళా అభ్యర్థే విజయం సాధించారు.



## వైసీపీకి మరో షాక్

- ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రిజైన్

**ఏపీ బ్యూరో:** ఏపీలో వైసిపి పార్టీకిమరో షాక్ తగిలింది ఇప్పటికే పలువురు నేతలు ఆ పార్టీని వీడి టిడిపిలో చేరుతుండగ ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామా చేశారు. తాజాగా కైకలూరుకు చెందిన ఆయన ఎమ్మెల్సీ పదవితో పాటు ఆ పార్టీకి గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామా లేఖను శాసన మండలి ఛైర్మన్ మోసేనురాజుకు పంపించారు. గతంలో తెదేపాలో కొనసాగిన జయమంగళ వెంకటరమణ.. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వైసీపీ లో చేరారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పార్టీకి ఆయన అంటీముట్టనట్లు ఉన్నారు. ఈ క్రమంలో జయమంగళ వెంకటరమణ రాజీనామా చేశారు.

# కర్ణాటకలో ఇకపై మత రాజకీయాలు ఉండవు

- డిప్యూటీ సీఎం డీకే శివకుమార్
- ఉప ఎన్నికల్లో మూడు స్థానాలు కాంగ్రెస్ అభ్యర్థుల ముందంజ



**నేషనల్ బ్యూరో:** కర్ణాటక రాష్ట్రంలో ఇక నుంచి మత రాజీకీయాలు ఉండవని, కేవలం అభివృద్ధి రాజకీయాలే ఉంటాయని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. కర్ణాటకలోని మూడు అసెంబ్లీ స్థానాలకు తాజాగా ఉప ఎన్నికలు జరిగాయి. ఈ మూడు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులే ముందంజలో ఉన్నారు.ఈ నేపథ్యంలో 'ఉప ఎన్నికల ఫలితాలపై మీ స్పందన ఏమిటి..?' అని మీడియా ప్రతినిధులు డీకే శివకుమార్ ప్రశ్నించారు. బీజేపీ చేసిన తప్పుడు ఆరోపణలు చచ్చిపోయాయని, ఇప్పుడు కేవలం అభివృద్ధి మాత్రమే జీవంతో ఉన్నదని అన్నారు. ఈ ఉప ఎన్నికల ఫలితాలు భవిష్యత్‌లో జరగబోయే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందనడానికి నిదర్శనమని డీకే అన్నారు. తాము 2028 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీనే గెలిపించబోతున్నామని రాష్ట్ర ప్రజలు సందేశం ఇచ్చారని ఆయన అన్నారు. ఇక రాష్ట్రంలో మత రాజకీయాలకు తావు లేదని, కేవలం అభివృద్ధి రాజకీయాలే ఉంటాయని పేర్కొన్నారు.

## షాపు గోడను ఢీకొట్టిన చేపల లారీ..

- చేపలను ఎత్తుకు వెళ్లిన ప్రజలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

**నేషనల్ బ్యూరో:** చేపలు రవాణా చేస్తున్న మినీ లారీ అదుపుతప్పింది. రోడ్డు పక్కనున్న ఒక షాపు వైపు దూసుకెళ్లింది. అక్కడి గోడను ఢీకొట్టింది. దీంతో ఆ లారీలో ఉన్న బతికున్న చేపలు అక్కడ చెల్లాచెదురుగా పడ్డాయి. ఇది చూసిన స్థానికులు వాటిని ఎత్తుకెళ్లారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్‌నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 21న మోహనాలోని దఫాలిపూర్ పెట్రోల్ బంక్ సమీపంలోని క్రాస్‌రోడ్ వద్ద షాపు బయట ఇద్దరు వ్యక్తులు కుర్చీల్లో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఇంతలో అదుపుతప్పిన మినీ లారీ వేగంగా వారి వైపు దూసుకొచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన ఆ ఇద్దరు వ్యక్తులు వెంటనే కుర్చీల నుంచి లేచి పక్కకు పరుగెత్తారు. కాగా, దూసుకొచ్చిన ఆ మినీ లారీ అక్కడున్న షాపు గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదం ధాటికి ఆ లారీలో



తరలిస్తున్న చేపలు చెల్లాచెదురుగా అక్కడ పడ్డాయి. స్థానికులు, రోడ్డున వెళ్లేవారు ఇది చూశారు. గుంపుగా అక్కడకు చేరుకున్నారు. చెల్లాచెదురుగా కింద పడిన బతికున్న చేపలను పట్టుకుపోయారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# చిన్న పత్రికలకు అన్యాయం చేయొద్దు

* అక్రిడిటేషన్ లను పెంచాలి
* చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబా




హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : చిన్న పత్రికలకు అక్రిడిటేషన్లు గతంలో ఉన్న మాదిరిగానే ఐ అండ్ పిఆర్ నుంచి ఖచ్చితంగా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర చిన్న మధ్య తరహా అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ అధ్యక్షులు యూసుఫ్ బాబు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం బషీర్ బాగ్ లోని దేశోద్ధారక భవన్ లో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన యూసుఫ్ బాబు మాట్లాడుతూ చిన్న పత్రికల మనుగడను ప్రశ్నార్థకం చేసేలా కొందరు అధికారులు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రలు తిప్పికొట్టేందుకు అందరూ సమైక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ లను అమ్ముతున్నామన్న ప్రచారం అవాస్తవం అన్నారు. అలాంటి వాళ్ళను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో రానున్న అక్రిడిటేషన్ల నూతన జీవోపై ఇప్పటినుంచి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే ఐ అండ్ పి ఆర్ కమిషనర్, మీడియా అకాడమీ చైర్మన్లను కలిసి అక్రిడేషన్ల విషయమై చర్చించాలని తెలిపారు. పాత జీవోలో ఉన్న గ్రేడింగ్ల విధానం కాకుండా నూతనంగా చిన్న పత్రికలకు న్యాయం చేసే విధంగా రావాలని ఆకాంక్షించారు. ఎందుకు అవసరమైతే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను చేసినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. సోమవారం సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి సమస్యలపై ఐ అండ్ పి ఆర్ కమిషనర్, అధికారులను కలిసి వినతిపత్రం అందజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్, మహబూబ్నగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్ , నిజామాబాద్,కొమరం భీం తదితర జిల్లాల నుండి పత్రికల సంపాదకులు పాల్గొన్నారు.

## బిసి, ఎస్సి, ఎస్టి రెసిడెన్షియల్ వెల్ఫేర్ హాస్టల్ లను అధనపు కలెక్టర్ తనిఖీ



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : కీసర మండలంలోని బిసి, ఎస్సి, ఎస్టి రెసిడెన్షియల్ వెల్ఫేర్ హాస్టల్ లను శనివారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తనిఖీ చేశారు. హాస్టల్లోని వంటశాల స్టోర్ రూమ్ భోజనశాలలను పరిశీలించారు. విద్యార్థుల అవసరాలను తీర్చాలని వారి భద్రత పట్ల శ్రద్ధ చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై నజర్ నహి..?

ప్రజాస్ఫూర్తి, నాగారం:ఒక పక్క జర్నలిస్టులమని చెబుతూ మరోపక్క ప్రభుత్వ ఆఫీసుల్లో తిష్ట వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రచారం జరుగుతున్న మండల ఉన్నత అధికారులు పట్టించుకోవడంలేదని వార్తలు వినిపిస్తున్నాయి. జర్నలిస్టులుగా బాధ్యతలు ఉంటే మంచిదే గాని ప్రతి పనిలో జోక్యం చేసుకుంటూ తమను కలిస్తే పని అయిపోతుందని ధోరణిలో కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనీ ప్రజలు వాపోతున్నారు. ఇదంతా చూసిన రెగ్యులర్ ఉద్యోగులు ఎలాంటి హోదా లేకుండా పొరుగు సేవల ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులకు భయపడాల్సి వస్తుందని మనోవేదనకు గురవుతున్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారు అని విశ్వనీయ సమాచారం. జర్నలిస్టుగా చెప్పుకుంటే తమకు ఏ అభ్యంతరం లేదుగానీ ప్రభుత్వ యంత్రాంగంలో వారి ఆధిపత్యం పై మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం ఇప్పటికైనా సంబంధిత వివిధ శాఖల మండల ఉన్నత అధికారులు జిల్లా అధికారులు కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై దృష్టి సారించి కఠినమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఎంపీ చామల ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



తిరుమలగిరి, ప్రజాస్ఫూర్తి : భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ని హైదరాబాద్ వారి నివాసంలో తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్సొజు నరేష్, తుంగతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే తుంగతుర్తి నియోజకవర్గానికి పలు అభివృద్ధి కార్యక్రమాలకు అధిక మొత్తంలో ఎంపి నిధులు కేటాయించాలని, అభివృద్ధిలో తుంగతుర్తి నియోజకవర్గాన్ని ముందు వరుసలో ఉంచాలని వారు కోరారు.

## ముస్తాబాద్లో బిజెపి శ్రేణుల సంబురాలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి కూటమి విజయం సాధించడం పట్ల బిజెపి ముస్తాబాద్ మండల అధ్యక్షుడు మేరుగు అంజా గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు శనివారం సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు మహారాష్ట్రలో ప్రచారం చేసినప్పటికీ మహారాష్ట్ర ఓటర్లు మాత్రం కాంగ్రెస్ పార్టీని నమ్మలేదని అన్నారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలో కూడా హామీలు అమలు పరచటం లేదని మహారాష్ట్ర ఓటర్లు గుర్తించి కాంగ్రెస్కు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరెడ్ల మల్లారెడ్డి, మల్లారపు సంతోష్ రెడ్డి, సొల్ల క్రాంతి, బాద నరేష్, కోల కృష్ణ గౌడ్, కస్తూరి కార్తీక్ రెడ్డి, మీస శంకర్, చీకోటి మహేష్, వరి వెంకటేష్, చిగురు వెంకన్న తదితరులున్నారు.

## వాయనాడ్లో ప్రియాంక గాంధీ విజయం ప్రజల విశ్వాసం యొక్క విజయం

* ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం. యుగంధర్ రెడ్డి



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : చారిత్రాత్మక ఎన్నికల విజయంలో ప్రియాంక గాంధీ వాద్రా వయనాడ్ నియోజకవర్గం నుండి పార్లమెంటు సభ్యురాలుగా ఎన్నికయ్యారని, ఇది ఆమె రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియాంక గాంధీ విజయం, సాంస్కృతిక వారసత్వం, విభిన్న సమాజానికి ప్రసిద్ధి చెందిన వాయనాడ్ ప్రజలు ఆమెపై ఉంచిన విశ్వాసం, విశ్వాసాన్ని సూచిస్తుందని గుర్తు చేశారు.భారీ మెజారిటీతో ఈ కీలకమైన ఎన్నికల పోటీలో ప్రియాంక గాంధీ సాధించిన విజయం, ఆమె నాయకత్వంలోని ప్రతిధ్వనిని, కేరళ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఆమె నిబద్ధతను హైలైట్ చేస్తుందని తెలిపారు. ఆమె విజయం ప్రతి పౌరుడి సంక్షేమంపై దృష్టి సారించే ప్రగతిశీల, సమ్మిళిత రాజకీయాలకు పెద్ద మద్దతును ప్రతిబింబిస్తుందన్నారు. వయనాడ్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడానికి, జాతీయ పురోగతి నుండి స్థానిక సమాజాలు ప్రయోజనం పొందేలా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆమె వాదించారని తెలిపారు. మహిళలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని, పార్లమెంటులో వారి వాణిని వినిపించేలా చూస్తానని ఆమె ప్రతిజ్ఞ చేసినట్లు తెలిపారు. వాయనాడ్ ప్రజలు ఈ విజయాన్ని జరుపుకుంటున్న సమయంలో ప్రియాంక గాంధీ ఇప్పుడు పార్లమెంటులో తన కొత్త పాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని, ఇక్కడ ఆమె తన నియోజకవర్గాల ఆందోళనలను సమర్థవంతంగా పరిష్కరించేలా చూసుకుంటూనే దేశాభివృద్ధికి అర్థవంతంగా దోహదపడాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ రైస్ పట్టివేత


- ఇద్దరిపై కేసు నమోదు





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అక్రమంగా పిడిఎస్ రైస్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ తెలిపారు. మండలంలోని నామాపూర్ గ్రామ శివారులో ఆటోలో పిడిఎస్ రైస్ తరలిస్తున్న ముస్తాబాద్కు చెందిన సదువుల భాస్కర్ను పట్టుకున్నట్లు, అతని వద్ద 5 క్వింటాళ్ల పిడిఎస్ రైస్, ఒక ఆటోను, మరో వ్యక్తి ఆవునూర్ కు చెందిన అనరాశి రాజేష్ను పట్టుకున్నట్లు, అతని వద్ద నుంచి 7 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని, ఒక ఆటోను స్వాధనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్కు తరలించి, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.


## శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఆలయంలోకి ఆహ్వానించి మంత్రికి వరిపట్టం పెట్టి స్వామి వారి యొక్క క్షేత్ర విశిష్టతను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి పొంగులేటి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రామాలయంలో ఉన్నటువంటి శ్రీ లక్ష్మి తాయారు అమ్మ వారి కోవెలలో మంత్రి పొంగులేటికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు , అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ భద్రాచలం రామాలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని దీనిలో భాగంగా ఇప్పటికే 70 కోట్ల రూపాయలను రామాలయం మాడవీదుల అభివృద్ధి కొరకు విడుదల చేయడం జరిగిందని ఈ మాడవీధుల అభివృద్ధికి సుమారు రెండు ఎకరాలకు పైగా భూమి కావాలని ఇప్పటికే అధికారులు దానికి సంబంధించినటువంటి ల్యాండ్ కూడా ప్రజల వద్ద నుండి ప్రజలకు వ్యాల్యూ చేసి భూమిని గుర్తించడం జరిగిందని త్వరలోనే రామాలయం అభివృద్ధి జరగడం ఖాయమని ఆయన అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రి తుమ్మల కూడా రామాలయం అభివృద్ధికి వెనకడుగు వేయరని పేర్కొన్నారు. భద్రాచలం రామాలయం మీద ప్రేమ ఉంది కనుక భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడం జరిగిందని మరొకసారి ఆయన గుర్తు చేశారు

## నేడు ఖమ్మం లో జరిగే ఎస్ ఎఫ్ ఐ పూర్వ నాయకుల మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

* అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత సిద్దెల రవి పిలుపు..



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) ఆవిర్భావం నుంచి నేటి వరకు నాయకులు గా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పనిచేసిన ఆ సంఘం మాజీ నాయకులు మహా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఖమ్మం నగరం ఎస్ ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ముఖ్య వక్తలు ఆ సంఘంలో గతంలో పని చేసిన ప్రొఫెసర్ కె నాగేశ్వర్, జెవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్ యూ) విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షురాలు అయిషా ఘోష్, డైరెక్టర్ కృష్ణయ్య లతో పాటు అనేక మంది ప్రముఖులు పాల్గొంటున్నారని తెలిపారు. కాగా ఈ ఆత్మీయ సమ్మేళనం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి ఆ సంఘంలో సేవలు అందించిన మాజీ నాయకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ప్రముఖ సాహితీవేత్త, కవి గాయకులు, అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు గ్రహీత సిద్దెల రవి పిలుపునిచ్చారు.

## అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం..!

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



ప్రజాస్ఫూర్తి,ఖమ్మం :అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ,సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం మంత్రి పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. నిధులతో చేపట్టిన పలు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ముందుగా తెల్దారుపల్లి గ్రామంలో 30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, మద్దులపల్లి గ్రామంలో 45 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, స్మశాన వాటిక పనులకు, గుర్రాలపాడు గ్రామంలో 70 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే సమయంలో ఎన్నికల ప్రచారంలో ఉన్నామని, మనం చూస్తుండగానే ఒక సంవత్సరం గడిచిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో మంచి స్థాయిలో తను ఉండటానికి కారణం ఈ ప్రాంత ప్రజలు అని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో కొన్ని అమలు చేశామని, చేయాల్సినవి ఇంకొన్ని ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు కోసం తానే మంత్రిగా ఉన్నానన్నారు.ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం ఇందిరమ్మ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, డిసెంబర్ మొదటి వారంలో గ్రామ సభలు నిర్వహించి దళారుల ప్రోద్బలం లేకుండా, ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేకుండా అర్హులకు పారదర్శకంగా ఇండ్లు కేటాయించడం జరుగుతుందని అన్నారు. ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డు అందిస్తామని, దీని ద్వారానే పేదలకు రేషన్, అర్హులకు వృద్ధాప్య పెన్షన్, ఆరోగ్యశ్రీ, గృహ జ్యోతి , 500 రూపాయల గ్యాస్ సిలిండర్, మొదలగు పథకాలు అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ ఆర్ అండ్ బి హేమలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ ఏడి సరిత, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైర హరినాథ్ బాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బండి జగ్గయ్య, కాంగ్రెస్ తమ్మినేని నవీన్, అధికారులు పాల్గొన్నారు.



# పసుపు.. కారంతో.. మహిళల విజయం

అది సిద్దిపేట నియోజకవర్గం పరిధిలో ఉండే మిట్టపల్లి గ్రామం. అక్కడి మహిళలు.. గత ప్రభుత్వం అందించిన సాయాన్ని తమ ఉపాధిగా మార్చుకున్నారు. గ్రామానికి చెందిన 11 మంది మహిళలు రెండు గ్రూపులుగా ఏర్పడ్డారు. వాటి పేరు దుర్గాభవాని, శ్రీరామ. 2021 జనవరిలో శ్రీరామ, దుర్గాభవాని గ్రూపులు పసుపు, కారం పొడి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను స్థాపించారు. వ్యాపారంలోకి అడుగుపెట్టాలనే లక్ష్యంతో మొదట ఒక్కో సభ్యురాలు రూ.15వేల చొప్పున జమ చేసుకున్నారు. పావలా వడ్డీ కింద బ్యాంకు నుంచి సుమారు రూ.47 లక్షల రుణం తీసుకున్నారు. ఆ మొత్తంతో పసుపు, కారం పొడి తయారీకి కావాల్సిన యంత్రాలను, ఇతర సామగ్రిని కొన్నారు. ఒక షెడ్ ఏర్పాటు చేసుకున్నారు. నాణ్యమైన పసుపు, కారంపొడి తయారుచేసి స్వయంగా ప్యాకింగ్ చేసి సిద్దిపేట రైతుబజారులో ఒక స్టాల్ ఏర్పాటు చేసి అమ్ముతున్నారు.





**వేతనం తీసుకుని...**

ఈ మహిళలు రోజుకు రూ.250 చొప్పున నెలకు ఒకసారి వేతనం తీసుకుంటారు. మిగిలిన డబ్బును బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తారు. ఈ మొత్తం నుంచి ముడిసరుకు కొంటారు. బ్యాంకు రుణం తీరాక లాభాలు పంచుకుంటారట.

**స్ఫూర్తిగా...**

ఈ స్ఫూర్తితో చుట్టు పక్కల జిల్లాలకు చెందిన మహిళలు మిట్టపల్లికి వచ్చి ఈ మహిళలను చూసి తెలుసుకుంటున్నారు. కారం పొడి తయారీకి వరంగల్ ఎనుమాముల మార్కెట్ నుంచి ఎండు మిర్చి కొనుగోలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో నాణ్యమైన మిర్చి దొరుకుతుందని తెలిస్తే.. అక్కడి నుంచి తెప్పించుకుంటున్నారు. నిజామాబాద్ మార్కెట్ నుంచి పసుపు కొమ్ములు తెస్తున్నారు. ఒకేసారి 1015 క్వింటాళ్ల వరకు మిర్చిని కొనుగోలు చేస్తారు. దానిని బాగా ఎండబెట్టి, కూలీలతో తొడిమెలు తీయించి.. కారం పొడి తయారీ చేస్తున్నారు. కిలో కారం పొడి రూ.300, కిలో పసుపు రూ.260కి విక్రయిస్తున్నారు. ప్రతి రోజూ సుమారు 20 కిలోల చొప్పున పసుపు, కారం పొడి అమ్ముతూ లాభాలు తెచ్చుకుంటున్నారు.



# బాల్కనీలో మొక్కల కోసం..

ఈ మధ్య బాల్కనీలో మొక్కలు పెంచుకోవడం ఫ్యాషన్ అయిపోయింది. ఐతే పెంచుకుంటే సరికాదు.. వాటి నిర్వహణ కూడా ముఖ్యమే. మరి ఈ వానకాలంలో బాల్కనీలో మొక్కల గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అంటే... సాధారణంగా వానకాలం మొక్కలు ఏపుగా పెరుగుతాయి. కానీ, ఇండోర్ ప్లాంట్స్‌కు మాత్రం ఈ కాలం ఇబ్బంది పెట్టేస్తుంది. కాబట్టి ఈ టిప్స్ పాటించండి.





△ సహజంగా ఇండోర్ ప్లాంట్స్‌కు నీరు తక్కువ అవసరం. అందుకని నీరు ఎక్కువగా పొయకూడదు. ఎందుకంటే మొక్కలకు తెగుళ్లు వచ్చే ప్రమాదం ఉంది. చల్లటి వాతావరణంలో నీరు ఇంకిపోవడానికి చాలా సమయం పడుతుంది. దీంతో తరచూ నీళ్లు పోస్తే.. వేళ్లు కుళ్లిపోయి మొక్క చనిపోయే ప్రమాదం ఉంది.

△ ఇండోర్ ప్లాంట్స్ ఆరోగ్యంగా ఉండాలంటే సూర్యరశ్మి చాలా అవసరం. వానాకాలం ఇంట్లోకి వెలుతురు సరిగా రాకపోవచ్చు. మొక్కల కుండీలను కిటికీల దగ్గర ఉంచితే బెటర్.

△ శుభ్రంగా ఉంచడం ఎంతో ముఖ్యం. ఆకులపై దుమ్ము పేరుకుపోతే వాటిపై ఉండే రంధ్రాలు మూసుకుపోయే అవకాశం ఉంటుంది. వడలిపోయిన లేదా కుళ్లిన ఆకులను మొక్క నుంచి తుంచేయాలి. ఆకులపై ఉండే దుమ్మును శుభ్రం చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ సక్రమంగా జరిగి మొక్క బాగా పెరుగుతుంది.

# మష్రూమ్ కాఫీ టేస్ట్ చేశారా..

ఈ చల్లని వాతావరణానికి వేడివేడి కాఫీ గొంతులోకి దిగుతుంటే హాయిగా ఉంటుంది.మెదడును ఉత్తేజపరచడంలో కాఫీ ఔషధంగా పనిచేస్తుంది. ఐతే కాఫీల్లో చాలా రకాలు ఉన్నాయి. వాటిలో మష్రూమ్ కాఫీ కూడా ఉంది.

△ సహజంగా ఇండోర్ ప్లాంట్స్‌కు నీరు తక్కువ అవసరం. అందుకని నీరు ఎక్కువగా పొయకూడదు. ఎందుకంటే మొక్కలకు తెగుళ్లు వచ్చే ప్రమాదం ఉంది. చల్లటి వాతావరణంలో నీరు ఇంకిపోవడానికి చాలా సమయం పడుతుంది. దీంతో తరచూ నీళ్లు పోస్తే.. వేళ్లు కుళ్లిపోయి మొక్క చనిపోయే ప్రమాదం ఉంది.

△ ఇండోర్ ప్లాంట్స్ ఆరోగ్యంగా ఉండాలంటే సూర్యరశ్మి చాలా అవసరం. వానాకాలం ఇంట్లోకి వెలుతురు సరిగా రాకపోవచ్చు. మొక్కల కుండీలను కిటికీల దగ్గర ఉంచితే బెటర్.


△ శుభ్రంగా ఉంచడం ఎంతో ముఖ్యం. ఆకులపై దుమ్ము పేరుకుపోతే వాటిపై ఉండే రంధ్రాలు మూసుకుపోయే అవకాశం ఉంటుంది. వడలిపోయిన లేదా కుళ్లిన ఆకులను మొక్క నుంచి తుంచేయాలి. ఆకులపై ఉండే దుమ్మును శుభ్రం చేయడం వల్ల కిరణజన్య సంయోగక్రియ సక్రమంగా జరిగి మొక్క బాగా పెరుగుతుంది.



**తయారీ ఇలా...**

మష్రూమ్ పౌడర్ సూపర్ మార్కెట్, ఆన్‌లైన్‌లోనూ లభిస్తుంది. చక్కెర, ఇన్‌స్టంట్ కాఫీ పౌడర్, పాలు కలిపి ఆ తర్వాత మష్రూమ్ పౌడర్ కలిపితే.. మష్రూమ్ కాఫీ రెడీ.





# అవన్నీ రూమర్సే..

## రెహమాన్ తో బంధంపై మోహినీ క్లారిటీ

ఆస్కార్ అవార్డ్ గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు, ఏ.ఆర్ రెహమాన్ సైరా బాను దంపతులు విడాకులు తీసుకోబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వీరిద్దరి విడాకులు ప్రకటించిన కాసేపటికే తన భర్త నుంచి విడిపోతున్నట్లు రెహమాన్ టీమ్‌లోని బాసిస్ట్ మోహిని డే వెల్లడించారు. గత కొన్నేళ్లుగా ఆమె రెహమన్ ట్రూప్‌లో కొనసాగుతున్నారు. అయితే రెహమాన్, మోహిని డే ఒకేరోజు విడాకులు ప్రకటించడంతో ఈ ఇద్దరి మధ్య సంబంధం ఉందని అందుకే విడాకులు తీసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా ఈ రూమర్స్‌పై మోహిని తన ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించింది. నేను విడాకులు ప్రకటించిన అనంతరం నుంచి మీ ఇంటర్వ్యూ కావాలని నాకు చాలా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. అయితే వీళ్లంతా ఎందుకు ఇంటర్వ్యూ చేద్దాం అనుకుంటున్నారో నాకు తెలుసు. ఈ చెత్తకు ప్రచారమివ్వాలన్న ఆసక్తి నాకు ఏమాత్రం లేదు. ఇలాంటి రూమర్స్‌పై మాట్లాడి నా విలువైన సమయాన్ని వృథా చేసుకోలేను. దయచేసి నా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి అంటూ మోహిని డే చెప్పకొచ్చింది. మరోవైపు ఇదే విషయంపై రెహమాన్ భార్య సైరా తరపు న్యాయవాది వందనా షా కూడా స్పందిస్తూ.. ఈ రూమార్స్‌లో ఎలాంటి నిజం లేదని క్లారిటీ ఇచ్చారు.

# విశ్వక్ సేన్ ఫుల్ బిజీ.. !

యువహీరో విశ్వక్ సేన్ ఫుల్ బిజీ అయిపోయాడు. ఒక సినిమా అయిన తర్వాత మరో సినిమా ప్రకటించడం కామన్. చేతిలో 23 సినిమాలు ఉంటుండంగానే ఇంకో సినిమాకు సైన్ చేయడం వెరైటీ. పెద్ద హీరోల్లో ప్రభాస్, యంగ్ హీరోల్లో విశ్వక్ ఈ పనిని సక్సెస్ ఫుల్ గా చేసి చూపిస్తున్నారు. ఆమధ్య గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాతో థియేటర్లలోకి వచ్చాడు విశ్వక్. తాజాగా మెకానిక్ రాకీ రిలీజ్ చేశాడు. సెట్స్ పై లైలా ఉంది. 3 నెలల కిందటే సుధాకర్ చెరుకూరి నిర్మాతగా శ్రీధర్ గంటా దర్శకత్వంలో సినిమా స్టార్ట్ చేశాడు. ఇవి కాకుండా పైప్ లైన్ లో అనుదీప్ కేవీ దర్శకత్వంలో సినిమా ఉంది. మరోవైపు దాస్ కా ధమ్కీ 2, ఫలక్ నుమా దాస్ 2 సినిమాలపై కూడా వర్కవుట్ చేస్తున్నాడు. రాబోయే 23 ఏళ్లకు ఈ సినిమాలు సరిపోతాయి. కానీ విశ్వక్ ఇక్కడితో ఆగడం లేదు. ఈమధ్య సాగర్ చంద్ర దర్శకత్వంలో సినిమాను కూడా లైన్లో పెట్టాడు.

షైన్ స్క్రీన్ బ్యానర్ పై తెలంగాణ నేపథ్యంలో ఈ సినిమా రాబోతోంది.


ఇలా ఒకటి, రెండు కాదు... ఏకంగా 5 సినిమాలు లైన్లో పెట్టాడు విశ్వక్ సేన్. వీటిలో 2 సినిమాలు స్వీయ దర్శకత్వంలో రాబోతున్నాయి. యంగ్ హీరోల్లో ఇన్ని సినిమాలు చేస్తున్న నటుడు విశ్వక్ సేన్ మాత్రమే.



# వారికి నోటీసులు పంపించిన రెహమాన్



ఇటీవల ఏఆర్ రెహమాన్ మీద వచ్చిన ఆరోపణలు అన్నీ ఇన్నీ కావు. ఆయన వ్యక్తిగత జీవితం మీద నోటికొచ్చినట్టు కొన్ని సైట్లు, ప్రముఖ వార్తా సంస్థలు సైతం రాసుకొచ్చాయి. కాగా ఈ రాతల పట్ల రెహమాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఏఆర్ రెహమాన్ వ్యక్తిగత జీవితం గురించి ఎవరైనా తమకు తోచింది రాసినా, యూట్యూబ్ వేదికగా అవాస్తవాలు ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన లీగల్ టీమ్ హెచ్చరించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రకటన విడుదల చేసింది. తన గురించి ఏ సామాజిక మాధ్యమం వేదికలోనైనా అసత్య ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేయమని రెహమాన్ సూచించినట్టు తెలిపింది. ఇప్పటికే పోస్ట్ చేసిన అభ్యంతరకర కంటెంట్‌ను 24 గంటల్లోపు తొలగించాలని, లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ 29 ఏళ్ల వివాహ బంధానికి స్వస్తి పలుకుతున్నట్టు రెహమాన్, సైరా బాను దంపతులు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. దీంతో, తాజాగా రెహమాన్ లీగల్ టీమ్ స్పందించిం



## హైదరాబాద్ లో తమన్నా, విజయ్ వర్మ పెళ్లి ఓ రిసార్ట్ బుక్?

ప్రముఖ నటి తమన్నా భాటియా గత కొద్దినెలలుగా నటుడు విజయ్ వర్మతో పీకలోతు ప్రేమలో మునిగితేలుతున్నది. ఎక్కడికి వెళ్లినా ఇద్దరు చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారు. వీరిద్దరి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించాయని..

త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నట్లు టాక్. వీరిద్దరి పెళ్లి వేదికగా హైదరాబాద్ కానున్నట్లు తెలుస్తున్నది. విజయ్ స్వస్థలం హైదరాబాద్ కావడంతో ఇక్కడే పెళ్లి చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రముఖ రిసార్ట్‌లో పెళ్లి వేడుక జరుగనున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే, పెళ్లి వార్తలపై అటు తమన్నా.. ఇటు విజయ్ వర్మ స్పందించలేదు. తమన్నా, విజయ్ వర్మ గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్నారు. లస్ట్ స్టోరీ 2 మూవీ సమయంలో ప్రేమ విషయాన్ని బయట పెట్టారు. అప్పటి నుంచి పెళ్లిపై ఎలాంటి ప్రకటన చేయలేదు.

తాజాగా నూతన సంవత్సరం 2025లో పెళ్లి చేసుకోనున్నారనే వార్త ట్రెండింగ్‌గా మారింది. పెళ్లి నేపథ్యంలో కాపురం పెట్టేందుకు ముంబయి బాంద్రాలో అపార్ట్‌మెంట్ కొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. విలాసవంతంగా ఉండే అపార్ట్‌మెంట్ కోసం వెతుకుతున్నారని..

పెళ్లి తర్వాత ఈ జంట అక్కడే కాపురం పెట్టాలని భావిస్తున్నట్లు బాలీవుడ్ కోడై కూస్తున్నది. విజయ్ వర్మ పుణేలోని ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో నటనలో శిక్షన తీసుకున్నాడు.

'గల్లిబాయ్' సినీరంగ ప్రవేశం చేశారు. 'మీర్జాపూర్', ఐసీ814' తదితర సినిమాల్లో కనిపించాడు. ఇక తమన్నా తెలుగు, తమిళం సినిమాలు చేసి అగ్రహీరోయిన్‌గా కొనసాగుతున్నది. ఇటీవల దక్షిణాదిలో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్‌లో సెటిల్ అయ్యింది. ప్రస్తుతం తెలుగులో ఓదెల 2 మూవీలో నటిస్తున్నది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.